www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 4 జూన్ 2025

5

తిరుపతి



ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.54 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు కర్ణాటక రాష్ట్రం మంగుళూరుకి చెందిన విద్యా రవిచంద్రన్ రూ.54 లక్షలు విరాళం అందించారు. డిడిలు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి అందజేశారు. అదనపు ఈఓ వెంకయ్య చౌదరి దాతను అభినందించారు.

అదనపు ఈవో వెంకయ్య చౌదరికి డీడీ ఇస్తున్న దాతలు

తోతాపురి మామిడి టన్ను రూ.12 వేలు

మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యంతో సమావేశమై నిర్ణయించిన తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మామిడి రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం తోతాపురి మామిడికి మద్దతు ధర రూ.12 వేలుగా నిర్ణయించడం జరిగిందని, అంతకంటే తక్కువ కాకుండా మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం, మామిడి మండి ర్యాంపుల వారు కొనుగోలు చేయాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్‌లు సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, వర్చువల్ విధానంలో పాల్గొనగా చిత్తూరు సమావేశ మందిరం నుండి చిత్తూరు జిల్లా కలెక్టర్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, డాక్టర్ కె. మురళీ మోహన్‌లు కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల సంఘాల నాయకులు హాజరై రైతులు, మామిడి పరిశ్రమల యాజమాన్యంతో తోతాపురి మామిడికి మద్దతు ధర నిర్ణయం పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, రైతులతో పాటు ప్రాసెసింగ్ పరిశ్రమల వారు కూడా పరిశ్రమలు నిర్వహించేందుకు అనుగుణంగా ఇద్దరికీ సామరస్యంగా ఉంటుందన్నారు. తమిళనాడు ప్రభుత్వంతో కూడా మామిడి రైతులకు గిట్టుబాటు ధర గురించి చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె. మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి పంట సాగు అధికంగా ఉన్నదని ఇందులో ప్రధానంగా ప్రాసెసింగ్‌కు అవసరమైన తోతాపురి రకం ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. జిల్లాలో మామిడి పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులకు పరిశ్రమల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాజమాన్యం చూడాలని, రైతులు కూడా మామిడి పరిశ్రమల యాజమాన్యానికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో గుజ్జు పరిశ్రమల యాజమాన్యం మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో ఉన్న సమస్యలు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాసెసింగ్ కంపెనీలలో ఇప్పటికే ఎక్కువగా గుజ్జు నిల్వ ఉందని, మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గిందని తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల కు సంబందించిన ఉద్యాన శాఖ డిడిలు మధుసూదన్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, రైతు సంఘ నాయకులు, మామిడి గుజ్జు పరిశ్రమల యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ దందాపై

విచారణకు ఎంపీ డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, ఎమ్మార్‌పల్లి, ఏఆర్ కార్యాలయంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే, నా దగ్గర విధులలో లేని వ్యక్తికి సంబంధించిన వ్యవహారాన్ని నాకు అంటగట్టాలని చూడడం టీడీపీ దగాకోరుతనానికి నిదర్శనమని తిరుపతి ఎంపీ గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకప్పుడు తన దగ్గర గన్‌మ్యాన్‌గా పని చేసిన ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను, ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రభుత్వానికి తిరిగి పంపానని గుర్తు చేశారు. ఇవన్నీ తాను చెప్పడం కాదని, సంబంధిత రికార్డులు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అంశంపై సిబిఐ విచారణ కోరుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి లేఖ రాసినట్టు తెలిపారు. ప్రజలిచ్చిన బాధ్యతల్ని నిర్వర్తించడం మినహా, తనకు ఇతర అంశాల గురించి తెలియదని స్పష్టం చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రాలైన తిరుపతి, తిరుమలలో శాంతిభద్రతలు కొరవడ్డాయని, తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకూ పోరాడుతానని ఆయన హెచ్చరించారు. అలాగే తనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు జాతీయ స్థాయిలోని అన్ని రకాల విచారణ సంస్థలతో దర్యాప్తు చేయించాలని కోరుతూ లేఖలు రాస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇలాంటి సంస్కారహీనమైన, తప్పుడు విధానాలతో తన మనోస్థైర్యాన్ని, పోరాట పటిమను దెబ్బతీయలేరని హితవు పలికారు.

తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి

మీరే వెన్నుపోటుదారులు

ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే వెన్నుపోటు కార్యక్రమం : పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ పాలనతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికార పగ్గాలు ఇచ్చారని, ప్రజలను మళ్లీ ఇబ్బంది పెట్టేందుకే ఈ వెన్నుపోటు కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మంచి పాలన అందించాల్సిన జగన్మోహన్ రెడ్డి తన పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, నేడు కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనపై బురదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సొంత కుటుంబ సభ్యులకే వెన్నుపోటు పొడిచిన జగన్మోహన్ రెడ్డి, ప్రజల వద్దకు వెన్నుపోటు దినోత్సవం అంటూ ఎలా ముందుకు వస్తున్నారు ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు' జగన్ ఇంటి పేరు : బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వెన్నుపోటు జగన్ ఇంటి పేరని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ ఇంటిలోనే వెన్నుపోట్ల సంస్కృతి ఉందని రాజారెడ్డి, వైఎస్సార్, షర్మిల ఉదంతాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఒకే ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిందన్నారు. పెన్షన్‌లు, రోడ్లు, బీసీ కార్పొరేషన్‌లు, మత్స్యకారుల సేవా పథకాలు అమలు పరిచిందని తెలిపారు. సామాజిక న్యాయానికి గౌరవంగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం మీద జగన్ వెన్నుపోటు అనడం హాస్యాస్పదమని అన్నారు.

పార్టీ పేరును కూడా కబ్జా చేసిన వ్యక్తి జగన్ : నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శివకుమార్ అనే వ్యక్తి ఏర్పాటు చేసిన వైయస్ పార్టీ పేరును కూడా కబ్జా చేసిన వ్యక్తిగా జగన్ మిగిలిపోతారని తిరుపతి టిడిపి పార్లమెంట్ డివిజన్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ ఎద్దేవా చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో 70 శాతం హామీలు అమలకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామన్నారు. హత్యల నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన జగన్ కుటుంబం లక్షల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. కుటుంబ సభ్యులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌ది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రామారావు, శ్రీధర్, జగన్నాథం, లలిత పాల్గొన్నారు.

'గుండెపోటు దినం' అని ప్రకటించాలి: కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికి తలపెట్టిన వెన్నుపోటు దినం పేరును గుండెపోటు దినం అని ప్రకటించాలని రాష్ట్ర ప్రజల తరపున ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఈమెయిల్ చేసినట్లు జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి నేడు కూటమి ప్రభుత్వం ద్వారా సుపరిపాలన అందుకుంటున్న ప్రజల ముందు వెన్నుపోటు దినం అని కార్యక్రమాన్ని నిర్వహించడానికి ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. సొంత బాబాయ్ గుండెపోటుతో చనిపోయాడని ఆనాడు ఎక్కడలేని ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మనోజ్, హరీష్, సునీల్, కిషోర్ రెడ్డి, సాయి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లు మార్పు

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శనార్థం శ్రీవారి మెట్టు నుండి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా శ్రీవారి మెట్టు వద్ద నుండి అలిపిరి, భూదేవి కాంప్లెక్స్‌కి మార్చాలని టిటిడి నిర్ణయించింది. ఈ మేరకు ఈ నూతన కౌంటర్లు శుక్రవారం సాయంత్రం నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఇదే అంశానికి సంబంధించి టిటిడి ఈవో జె. శ్యామలరావు మంగళవారం సాయంత్రం వర్చువల్ సమావేశం ద్వారా టిటిడి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తిరుపతి జేఈవో వి. వీరబ్రహ్మం, టీటీడీ ఇన్‌చార్జి సీవీఅండ్ఎస్‌వో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు మనోహరం, వెంకటేశ్వరులు, జీఎం (ట్రాన్స్‌పోర్ట్) శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, సెల్వం, గోవింద రాజన్, సోమనారాయణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన శశాంక్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, దూరవిద్యా కేంద్రంలో అకడమిక్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రహ్లాద రెడ్డి, రెడ్డిరాణి కుమారుడు ఎం.శశాంక్ రెడ్డి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు ఆల్ ఇండియా 40 ర్యాంకు సాధించారు. మడితాటి శశాంక్ రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులలో బాగా రానిస్తున్నాడు. 1 నుంచి 7వ తరగతి వరకు తిరుపతిలోని భాష్యం పాఠశాలలో, 8 నుంచి 10 వ తరగతి వరకు నారాయణ పాఠశాలలో చదవాడు. 10వ తరగతిలో 590 మార్కులు, ఇంటర్ లో 980 మార్కులు సాధించారు. ఇంటర్ నారాయణ కళాశాలలో చదువుతూ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు ఆల్ ఇండియా స్థాయిలో ఉన్నత ర్యాంకు లక్ష్యంగా చదివినట్లు వెల్లడించారు. సాధారణ రైతు బిడ్డ అయినా శశాంక్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల కష్టాలను చూసి ఎంతో క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలలో మంచిర్యాంకు సాధించాలనే కసితో చదివానన్నారు. రాయచోటి దగ్గర వీరబల్లి తన అవ్వ, తాతల వ్యవసాయ పొలంలో కష్టాలను చూసి మంచి ఇంజనీర్ కావాలని, రైతులకు సహాయం చేసే యంత్రాలను కనిపెట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. నారాయణ కాలేజీలో అధ్యాపకుల సహకారం, సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలలో 40 ర్యాంకు సాధించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశంలోని ఐఐటిలో సీటు సంపాదించాలని తన లక్ష్యంగా పెట్టుకొని ఈ ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ఎప్పటికైనా తను ఐఏఎస్ సాధించాలని లక్ష్యంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు, సిబ్బంది, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌కు వినతి

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : విజయవాడ సెక్రటేరియట్లో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌ను యానాదుల సంక్షేమ సంఘం బృందం మంగళవారం కలిసి పలు సమస్యలతో కూడిన అర్జీ ఇచ్చారు. యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు, 30 కేజీల బియ్యం కార్డులు ఇవ్వాలని, గిరిజన గురుకులాల్లో సమస్యల గురించి వివరించడం జరిగింది. మల్లికార్జున నాయక్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మలికి చెంచయ్య, చలంచర్ల రవీంద్ర, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

కోర్టు ప్రాంగణంలో టీడీపీ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి టిడిపి నేతలపై కేసులు కొట్టివేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. 2019 లో జరిగిన జనరల్ ఎలక్షన్లలో రాజకీయ దురుద్దేశంతో ప్రచారానికి సంబంధిత అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోలేదని గతంలో తెలుగుదేశం నాయకులపై నమోదైన కేసు విచారణ పూర్తయింది. మంగళవారం 2 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ కేసులు కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. అందులో ఉన్న 10 మందిని నిర్దోషులుగా నిర్ధానించి కేసు కొట్టి వేశారు. ఈ కేసులో ఎపిజి అండ్ బీసీ ఛైర్మన్, తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మరియు తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ, మాజీ ఎంపీ, తిరుమల తిరుపతి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ , తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, బి.జి. కృష్ణ యాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆషాలతకలు ఉన్నారు. ఈ కేసును తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ దినకర్ సత్యశ్రీవాసన్ వాదించారు.

నారాయణ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటడంతో మంగళవారం ఆ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్ పల్లి బ్రాంచ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బాలాజీ కాలనీ సర్కిల్, కార్పొరేషన్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఎంఆర్ పల్లి వరకు సాగింది. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో తమ విద్యార్థులు ఓపెన్ క్యాటగిరిలో ఆల్ ఇండియా 51వ ర్యాంక్‌తో పాటు మరెన్నో టాప్ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రశంసించుటలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ఎంజీఎం విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో శ్రీకాళహస్తి ఎంజీఎం జూనియర్ కళాశాల విద్యార్థిని గోరంట్ల చరిష్మా ప్రతిభ చూపింది. ఆలిండియా స్థాయిలో 4120 ర్యాంక్ సాధించి కళాశాలకు ఖ్యాతి తెచ్చిపెట్టింది. ప్రతిభ చూపిన విద్యార్థినిని కళాశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. రాబోవు 2025-26 విద్యా సంవత్సరం నుండి నూతనంగా ఎంజీఎం ఫేస్ ప్రోగ్రాం (ఫర్ ఆల్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్) ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థిని, విద్యార్థులను అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేల తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఫీజు దోపిడీ అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అక్రమంగా వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కి, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, కార్యదర్శి భగత్ రవిలు మాట్లాడుతూ 2025 విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఒక్కో స్కూల్ ఒక్కో రకంగా వసూలు చేస్తున్నారన్నారు. విద్యా కేంద్రాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి బుక్స్, స్టేషనరీ కూడా తమ వద్దే కొనాలని ఆంక్షలు పెడుతున్నారని తెలిపారు. తల్లితండ్రులతో కమిటీ ఏర్పాటు చేసి ఎఫ్ఆర్‌సి చైర్మన్‌గా కలెక్టర్ కలిసి జిల్లాలోని ఫీజులు నిర్ణయం చేసి పగడ్బందీగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన విద్యా సంస్థలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో డిఇఓ ద్వారా న వ హా వే శ ం నిర్వహించి అక్రమ ఫీజులను నియంత్రిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి తేజ, నాయకులు శివ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ జాయింట్ శుభం బన్సల్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై ఆయన వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పిడిలు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆరు లైన్ల రహదారుల నిర్మాణం, తిరుపతి బైపాస్ నిర్మాణం వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని, భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డెప్యూటీ తాసిల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేని బాలురుకి స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణ చారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ సంజయ్ కుమార్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, టౌన్ క్లబ్, గరుడ సర్కిల్, నంది సర్కిల్ తోపాటు నాలుగు కాళ్ల మండపం వద్ద తనిఖీలు చేపట్టారు. 17 మంది మైనర్లు బాలురు ద్విచక్ర వాహనాలను నడపడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తరువాత వారి కుటుంబ సభ్యులను పిలిపించి వారికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎంసీఏ ఫలితాలలో ఆర్‌సిఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ర్యాంకులు సాధించవచ్చని ఆర్ సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. స్థానిక రేణిగుంట మండలంలోని కరకంబాడి–తిరుపతి రోడ్డులోని ఆర్ సి ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంసీఏ రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో తమ ప్రతిభను చాటారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నేడు విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ఫలితాలను సాధించడం జరిగిందని తెలిపారు. యమ్.చైతన్య లక్ష్మి 8.4, టి.కౌసల్య 8.4, ఎ.లక్ష్మి 8.38, బి.సౌజన్య 8.37, బి.హేమలత 8.33 జిపిఏ గ్రేడ్ మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ ఆర్. శివప్రసాద్ వర్మ, విభాగాధిపతులు వై.నిరీష, పి.లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మాధురిలు అభినందించారు.

జగన్ సీఎం అయ్యేందుకు యువత కృషి చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన హేమంత్ రెడ్డి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైసీపీలో యువజన విభాగం కీలకమని, గ్రామస్థాయి నుండి యువజన విభాగాన్ని పటిష్టం చేయాలని సూచించారు. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్‌గా అవకాశం కల్పించిన పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి, మిథున్ రెడ్డికి, సహకరించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో యువజన విభాగం నాయకులు జ్ఞానేంద్ర రెడ్డి, జంపాల రాజేష్, లోక, శరత్ రెడ్డి, దిలీప్ కుమార్, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఖాళీలు పూరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శి కొగిలి ముని చందు, ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్‌లు కోరారు. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక వసతులు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ట్రంకు పెట్టెలు పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు, దోమతెరలు అందించాలని, గత కొన్ని నెలలుగా పెండింగ్లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. ఈ విషయమై మంగళవారం శ్రీకాళహస్తి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

ఏనుగులు సంచారంపై అవగాహన

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చిట్టేచెర్ల పంచాయితీలో ఏనుగులు సంచరించే సమయంలో రైతులు, గ్రామస్తులు తీసుకోవలసిన జాగ్రతలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఆర్డిఓ రామ్మోహన్ పాల్గొన్నారు. ఫారెస్ట్ అధికారులు అటవీ ప్రాంత రైతులకు పలు సూచనలు చేశారు. ఏనుగుల సంచారం తెలిసిన వెంటనే ఫారెస్ట్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. దీనివల్ల నష్టనివారణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ఎమ్మార్వో జనార్దన్ రాజు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం వెంకటరమణ, ప్రభుత్వ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఏడాది పాలన దూసుకుపోతుందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు కొనియాడారు. మంగళవారం 43వ డివిజన్‌లో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్ పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిశేఖర్ రాయల్, శీను వెంకట్ రెడ్డి, ప్రసాద్, నళిని వెంకటేష్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శ్రీనాథ్ చౌక దుకాణం డీలర్ పావని రమణ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ

రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకు పాలన అందిస్తోందని, అందులో భాగంగా రేషన్ సరుకులు తీసుకోలేని లబ్ధిదారులకు ఇంటికి చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏపీజీబీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ అన్నారు. మంగళవారం తిరుపతి నగర పరిధిలోని 43వ డివిజన్లో స్థానిక ప్రజలకు రేషన్ సరుకులను రాష్ట్ర యాదవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణలతో కలిసి పంపిణీ చేశారు. ఈ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, 43వ వార్డు ఇన్చార్జి ఆర్పి శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, శ్రీను, వెంకట్ రెడ్డి, ప్రసాద్, నళిని, చౌక దుకాణదారుల జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనాథ్, 45వ చౌక దుకాణ డీలర్ పావని, రమణ పాల్గొన్నారు.

చెస్ ఓపెన్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

వేమన విజ్ఞాన కేంద్రంలో చెస్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

వేమన విజ్ఞానకేంద్రం, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ చెస్ టోర్నమెంట్, ఆదివారం జూన్ 8, 2025 న వేమన విజ్ఞానకేంద్రం వేదికగా జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, తిరుపతి చెస్ అసోసియేషన్ సీఈఓ బాలాజీ ప్రసాద్ చౌదరి, ఇతర నాయకులు రెడ్డెప్ప, నడ్డినారాయణ, పంచముఖేశ్వరరావు, మునిరాజ,గురునాథం, తహసున్నీసా, రెడ్డెప్ప లక్ష్మీనారాయణ, ఇమామ్, జ్ఞానప్రసూన తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ అన్ని వయసుల చెస్ ఆటగాళ్లకు ఒక గొప్ప వేదికగా ఉంటుందని వారు తెలిపారు. ఇందులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లు, కొత్త ఆటగాళ్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం పొందుతారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి అయిదు స్థానాలు సాదించిన విఏతలకు, వివిధ వయసు విభాగాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు, ఆకర్షణీయమైన ట్రోఫీలు అందించబడతాయని తెలిపారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ మెడల్స్, సర్టిఫికెట్స్ అందిస్తామని తెలిపారు. క్రీడాకారులందరికీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. టోర్నమెంట్ వివరాలు: తేదీ: జూన్ 8, 2025బీ ఆదివారం వేదిక:వేమన విజ్ఞాన కేంద్రం, యశోద నగర్, తిరుపతి. సమయం:ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు, ఎంట్రీ ఫీజు:200 రూపాయలు. ఈ ఈవెంట్ చెస్ సమాజంలో ఉత్సాహాన్ని పెంచడానికి, ఆటగాళ్లకు తమ నైపుణ్యాలను పెంపొందించే అవకాశం కల్పించడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8555921134, 8985080370 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించటం ద్వారా సాగులో అనవసర ఖర్చు తగ్గించుకొని అధిక నికరాదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ దివ్య తెలిపారు. పిచ్చాటూరు మండలం కారూరు, అడివి కోయం బేడు, గోవర్ధన గిరి గ్రామాలలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం "వికసిత్ కృషి సంకల్ప అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ సుమంత్ కొండు, జిల్లా శిక్షణా కేంద్రం నుండి శ్రీ వేణుగోపాల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా భాగంగా శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు రాబోయే ఖరీఫ్ సీజన్లో పండించే పంటలలో నూతన రకాలు, చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, వ్యవసాయ డ్రోన్‌లు, జీవన ఎరువుల వినియోగం, రైతు సంక్షేమ పథకాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పాడి పశువుల పోషణ మొదలైన అంశాలపై అవగాహన కల్పించి, వ్యవసాయ డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ, సేవ సమితి అధికారులు, రైతులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్పీబీ పాటల కచేరికి విచ్చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 4వ తేదీన ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాటల కచేరీని జయప్రదం చేయాలని ప్రజా నాట్యమండలి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి వేణు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. కచేరీ కరపత్రాలను ఆవిష్కరించారు. బాలు ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిందని, ఆయన జ్ఞాపకార్థంగా అదే పాఠశాలలో పాటల కచేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 52 మంది గాయకులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కచేరి సాగుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటరమణ, సెల్వరాజు, శాంతి, గురునాథం, సుబ్రమణ్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన ప్రజలకు వివరిస్తాం: వైసిపి

విలేకరులతో మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియంతృత్వ పాలన సాగిస్తున్నారని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేయమని, అదనంగా పథకాలను ఇస్తామని ప్రగల్భాలు బలికిన ప్రభుత్వ పెద్దలు నేడు ప్రజల చెంతకు చేరిన పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగరి నియోజకవర్గ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలకు హామీలు ఇచ్చి అమలు పరచకుండా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఏ రూపంలో ప్రజలకు మోసం జరిగిందో వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అనంతరం మండల తహసిల్దారులకు వినతులు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సారధి గౌడ్ పాల్గొన్నారు.

వెనకేసిన అవినీతి సొమ్మును వెనక్కు ఇవ్వగలవా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఐదేళ్లు వైసీపీలో ఎవ్వరికీ తెలియకుండా అవినీతి చేసి వెనకేసిన సొమ్మును నేడు నిజాయితీపరుడుగా చెప్పుకుంటున్న పద్మావతి పురం మాజీ సర్పంచి గణపతి నాయుడు వెనక్కు ఇవ్వగలరా అని వెంకటపతి నగర్ సర్పంచి చిన్నియాదవ్ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వైసీపీలో నమ్మకస్తుడిగా ఉండి నేడు ఎవరి అండదండలతో అయితే ఇంత పేరు ప్రఖ్యాతలు సంపాదించారో గణపతి నాయుడు ఈరోజు పార్టీ మారగానే నీతులు వల్లించడం హాస్యాస్పదమన్నారు. ఆయన కబ్జాలు, అక్రమ నిర్మాణాలు చేసి లక్షల సంపాదించారని ఆరోపించారు. బాధితులకు స్థలాలను, డబ్బు తిరిగి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారా లేదో చెప్పాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పేరూరు సర్పంచి దామినేటి కేశవులు, వైసిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, వాసు, దేవా తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి మిత్ర' కిట్ల పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఎం.ఈ.ఓ కార్యాలయం నుంచి మండలంలో ఉన్న అన్ని పాఠశాలలకు సరఫరా అవుతున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మంగళవారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పునః ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎం.ఈ.ఓలకు సూచించారు. ఎం.ఈ.ఓ భువనేశ్వరి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని పాఠశాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పాశిం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్యులు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ సోమిశెట్టి చెంచు రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ వాయిద్యం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కేక్ కట్ చేసి అందరికీ అందించారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపుకు ఆర్యవైశ్యులు ఎంతో కృషి చేశారని, ఆర్యవైశ్య నాయకులు చెంచురామయ్యకి త్వరలో మంచి పదవి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి సాయికృష్ణ, వెంకటసుబ్బయ్య, ఎస్ఎల్ఎన్ బాబు, కోట రామారావు సురేష్, కొండ భాస్కర్, బయ్యా మోహన్ రావు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో కోట్లు కొల్లగొట్టారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి హయంలో పథకాల పేరుతో కోట్ల రూపాయలను కొల్లగొట్టారని ఏపీ విద్యార్థి యువజన జేఏసీ చైర్మన్ రవిశంకర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయంలో అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని, కళాశాలలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్, ఫార్మసీ కళాశాలలకు బకాయిలు, సంక్షేమ హాస్టళ్లకు అందివ్వాల్సిన మెస్ చార్జీలు, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఎగ్గొట్టారని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలకు ఇవ్వవలసిన బకాయిలపై ప్రశ్నించడంతో బెదిరింపులకు దిగారని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓ కళాశాల యజమాని ఆత్మహత్య చేసుకున్న విషయం వాస్తవం కాదాని ప్రశ్నించారు. డీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేస్తామని నమ్మబలికి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఇవి విలేకరుల సమావేశంలో కృష్ణారెడ్డి, ఆర్సిపురం మండల టిడిపి మాజీ అధ్యక్షులు లీలా మోహన్ నాయుడు, దిలీప్ రాయల్, మనోజ్, ప్రసాద్ రెడ్డి, రమణ, రోసిరెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం జయప్రదం చేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి :

ఏడాది పాలనలో ఓటు వేసిన ప్రజలకు టిడిపి జనసేన నాయకులు వెన్నుపోటు పొడిచారని, అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని, మోసపూరిత వాగ్దానాలతో ఆర్భాటంతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేసినందుకే వైఎస్ఆర్సిపి వెన్నుపోటు దినమును నిర్వహిస్తుందని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. స్థానిక నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులకు వైఎస్ఆర్సిపి కి వచ్చిన 11 సీట్లు కనబడుతున్నాయని 40 శాతం ఓట్లు కనిపించడం లేదని విమర్శించారు. ఎన్నికలప్పుడు టీడీపీ ఇచ్చిన హామీలు ఏమాయ్యాయని ప్రశ్నించారు. ప్రజా మద్దతుతో ప్రభుత్వం కళ్లు తెరిపించేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. వెన్నుపోటు దినం శాంతియుత ర్యాలీగా కార్యక్రమం జరుగుతుందని ఈ మేరకు సంబంధిత అధికారులను అనుమతి కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలోని కుక్కం భాగం గ్రామ పంచాయతీకి చెందిన కుంభాకం రెవెన్యూ సర్వే నంబర్ 81 లో 82 ఎకరాల 80 సెంట్లు భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి మంగళవారం ఉదయం తాసిల్దార్ శ్రీదేవి భూమి సర్వే చేసి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమించిన లేదా భూమిలో ఎవరైనా పంటవేసిన వారు చట్టపరంగా శిక్షార్హులు అవుతారని తహశీల్దార్ హెచ్చరించారు.

వైఖానస ఆగమ సలహాదారులుగా

వేద వర్సిటీ ఆచార్యులు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ సలహాదారులుగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైఖానస విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ పరాశరం భావనారాయణ నియమితుల య్యారు. ఈ మేరకు టీటీడీ ఈవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి భాస్కరుడు, డాక్టర్ భావనారా యణను ఘనంగా సత్కరించారు.

క్రైం న్యూస్

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మృతి చెందిన చిత్తూరు మునీంద్ర, (పక్కన ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తడ: తడ మండలం, బోడిలింగాల పాడు క్రాస్ వద్ద తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొని ఆరంభాకం నుండి ఉచ్చూరుకు బైక్‌పై వెళుతున్న చిత్తూరు మునీంద్ర మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మునీంద్ర(25) హౌస్ వైరింగ్ ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. మునీంద్ర ఆరంభాకంలో పనిమీద వెళ్లి తిరిగి ఉచ్చూరుకు వస్తున్న క్రమంలో తడ మండలం బోడి లింగాలపాడు క్రాస్ రోడ్ వద్దకు వచ్చేసరికి బైక్ ముందు వెళ్తున్న తమిళనాడుకు ఆర్టీసీ బస్సు ఎటువంటి సిగ్నల్ లేకుండా చెన్నైకి వెళ్లడానికి యూటర్న్ తీసుకోవడంతో మునీంద్ర బైకు అదుపు చేయలేక బస్సును ఢీకొట్టి కిందపడిపోయాడన్నారు. తలకు పెద్ద గాయం అవడంతో స్పృహ కోల్పోయి పడిపోయాడని తెలిపారు. చుట్టుపక్కలవారు చూసి 108కు ఫోన్ చేసి సుళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించారని తెలిపారు. మునీంద్ర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీ కొని కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని సూళ్లూరుపేట రోడ్డు నీర్పాకోట బీఎస్ఎన్ఎల్ కార్యాయం సమీపంలో శ్రీకాళహస్తి నుంచి వేగంగా వస్తునన్న ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం కూలిపోయి వైర్లు తెగిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్కో ఏఈ చలపతి ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు పిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్తును సరఫరా పునరుద్ధరించారు.

టెంపో బోల్తా.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ఓజిలి : జాతీయ రహదారిపై టెంపో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన ఓజిలి మండలం రాచపాళెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాదుకు చెందిన 14 మంది టెంపోలో పాండిచ్చేరి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో, ఓజిలి మండలం రాచపాళెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు హైవే డివైడర్ను ఢీకొని వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రశాంతి, అంజమ్మ, సబితకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కే.స్వప్న సంఘటన స్థలానికి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అల్లెమడుగుపేటు కొండపై గుర్తు తెలియని మృత దేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి సమీపంలోని అల్లెమడుగు పేటు కొండపై గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని మంగళవారం పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహం బాగా కుళ్ళిపోయి ఉండడంతో వ్యక్తి ఆనవాళ్లను గుర్తించలేని స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, చెవికి కమ్మపోగు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సెల్ :9440796762, 9866667857 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ గోపీ కోరారు.

మూర్ఛతో సెక్యూరిటీ గార్డు మృతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆలత్తూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న పసల సాంబయ్య (45) మంగళవారం మూర్ఛ వ్యాధితో మృతి చెందారు. ఈ ఘటనపై సీఐ తిమ్మయ్య ఎస్ఐ విశ్వనాథనాయుడు అందించిన వివరాల మేరకు ఆలత్తూరుకు చెందిన పసల సాంబయ్య గ్రామంలో ఉన్న శ్రీనిధి రాజా అట్టల పరిశ్రమలో 11 రోజుల క్రితం సెక్యూరిటీ గార్డుగా చేరి పని చేస్తున్నారు. సోమవారం డ్యూటి ముగించుకుని ఫ్యాక్టరీలోని గదిలో విశ్రాంతి కోసం వెళ్లగా మూర్ఛ రావడంతో సహచరులు చూసి శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు డాక్టరు ధృవీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహంతో ఫ్యాక్టరీ ముందు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐ, ఎస్ఐలు కుటంబ సభ్యులతో చర్చలు జరిపి కుటుంబానికి ఆర్థిక భోరోసా ఏర్పాటు చేయాలని ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రేణిగుంట: వేణుగోపాలపురం, సమాధుల వద్ద, ముళ్ళ పొదలలో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు 55-60 సంవత్సరాల మధ్య ఉంటుంది. అతని వద్ద ఆధారాలు ఏవీ లభ్యం కాలేదని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రేణిగుంట పోలీస్ స్టేషన్ తెలియజేయాలని పోలీసులు కోరారు.

చెరువులో దిగి వ్యక్తి గల్లంతు

పొద్దుపోయేంత వరకు గాలింపు కొనసాగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, రసనమాల గ్రామంలో మంగళవారం సాయంకాలం 6 గంటల సమయంలో దొడ్డగ శ్రీనివాసులు(55) భార్యతో కలిసి బర్రె దూడ కనిపించలేదని వెదుకులాట ప్రారంభించాడు. ఎక్కడా కనపడకపోవడంతో, చెరువులో దిగిందేమోనని అనుమానంతో.. దానిని వెతికే క్రమంలో చెరువులో దిగి భార్య మాధవి కళ్ళముందే కనిపించకుండా పోయాడు. సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు ఎస్సై నాగరాజు, వీఆర్వో రమేష్ గ్రామస్తులతో కలిసి శ్రీనివాసులు ఆచూకీకోసం చెరువులో వెతికించడం మొదలుపెట్టారు. శ్రీనివాసులకు కుమారుడు సాయి (24), కుమార్తె భవాని (22) ఇద్దరు పిల్లలు ఉన్నారు, అతని మీదే ఆధారపడి కుటుంబం జీవిస్తుందని గ్రామస్తులు తెలియజేశారు. ఈ ఘటనతో గ్రామములో విషాదఛాయలు నెలకొన్నాయి. పొద్దుపోయేంతవరకు ఆచూకీ దొరకలేదని పోలీసులు తెలిపారు.